# బలగం BALAGAM TV

BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 02 మే 2025 | www.balagamtv.com | పేజీలు 4


## ఎల్ఆర్ఎస్‌కు గడువు పెంపు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

రాష్ట్ర ప్రభుత్వం లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్ఆర్ఎస్) దరఖాస్తుదారుల ప్రయో జనం కోసం ఏప్రిల్ నెలాఖరు వరకు వన్ టైం సెటిల్‌మెంట్ చేసిన వారికి 25 శాతం రాయితీ ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే వివిధ కారణాలతో ప్రజలు ఈ అవకాశాన్ని పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకో లేకపోయారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం మళ్లీ మూడు రోజుల పాటు గడువు పొడిగించింది. ఈ నెల 3వ తేదీలోపు ఎల్ఆర్ఎస్ ఫీజు చెల్లించిన వారికి వన్ టైం సెటిల్‌మెంట్ కింద 25 శాతం రాయితీ ప్రకటించింది. ఎఫ్‌టీఎల్, నిషేధించిన సర్వే నంబర్లు మినహా ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేసుకున్న వారందరికీ రెగ్యులరైజేషన్ ఫీజు నిర్ణయించారు. ఫీజు చెల్లించేందుకు అర్హత ఉన్న దరఖాస్తుదారులు మే 3వ తేదీలోగా నిర్ణీత రుసుము చెల్లిస్తే రిబేటు వర్తిస్తుందని ప్రభుత్వం ప్రకటించింది.

# చర్చలకు సిద్ధం

## ఆర్టీసీ కార్మికులు సమ్మె ఆలోచన విరమించండి



- రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగాలేదు
- ప్రతి నెలా రాష్ట్ర ఆదాయం రూ.18 వేల కోట్లు
- ప్రభుత్వ కనీస వ్యయం రూ.22 వేల కోట్లు ఈ మొత్తం అప్పులు, వడ్డీలకే పోతుంది
- క్లిష్ట సమయంలో సహకరించాలని ప్రజలకు వినతి
- రవీంద్రభారతిలో ఘనంగా మేడే వేడుకలు

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

'ఆర్టీసీలో సమ్మెపై చర్చలు జరుగుతున్నాయంటున్నారు. ఆర్టీసీ కార్మికులకు విజ్ఞప్తి చేస్తున్నా సమ్మె ఆలోచన వీడండి. ఇప్పుడిప్పుడే ఆర్టీసీ లాభాల బాటలో పయనిస్తోంది' అని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. మీ సంస్థ దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ఆర్టీసీ కార్మికులపైనే ఉందని ఆయన అన్నారు. గత పదేళ్లలో విధ్వంసం జరిగిందని ఆరోపించారు. గత పాలకులు 50 వేల కోట్లు కాంట్రాక్టర్లకు బిల్లులు పెండింగ్ పెట్టారని, 1 లక్షా 20 వేల కోట్లు ఇతర విభాగాల్లో పెండింగ్ పెట్టి వెళ్లారని, సర్పంచులకు బకాయిలు చెల్లించలేదని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేదని, సమ్మెలు చేయవద్దని సీఎం రేవంత్ రెడ్డి కార్మిక సంఘాలకు విజ్ఞప్తి చేశారు. సంస్థను కాపాడుకునే బాధ్యత ఉద్యోగులపై ఉందని, సమ్మెకు దూరంగా ఉండి సహకరించాలని ఆయన కోరారు. కార్మికుల సహకారంతోనే ప్రభుత్వం ఏర్పడిందని, వారి సంక్షేమం కోసం పని చేయడానికి సిద్ధంగా ఉన్నానని అన్నారు. ప్రజల సూచనల మేరకు రాష్ట్రాన్ని నడుపుతానని తెలిపారు. కార్మికుల శ్రమ ఎప్పుడూ వృథా కాదు.. మీకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని సీఎం హామీ ఇచ్చారు.

ప్రపంచ కార్మిక దినోత్సవం సందర్భంగా తెలంగాణ కార్మిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్మిక సోదరులందరికీ ముఖ్యమంత్రి మేడే శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలోని అసంఘటిత కార్మికుల కోసం దేశానికి రోల్ మాడల్‌గా ఉండే ఒక మంచి విధానం తీసుకొస్తామని ప్రకటించారు. "మే డే రోజున కార్మిక సోదరులకు మాటిస్తున్నా. ఏ వెసులుబాటు ఉన్నా ప్రతి రూపాయి కార్మికుల సంక్షేమం, అభివృద్ధి, వారి పిల్లల భవిష్యత్తు కోసం ఖర్చు పెట్టే బాధ్యత తీసుకుంటా. ఒకనాడు నష్టాల ఊబిలో కూరుకుపోయి ఆత్మహత్యలు జరుగుతున్న ఆర్టీసీలో ఈరోజు లాభాల బాటలో నడిచి జీతాలు చెల్లించుకునే స్థాయికి చేరుకోవడంలో కార్మికుల కృషి ఎంతో ఉంది. ఆర్టీసీని గాడిలో పెట్టి లాభాల వైపు నడిపించే ప్రయత్నం చేస్తున్నాం. సమ్మెకు వెళ్లాలని చర్చలు చేస్తున్నారు. ఈ సంస్థ మీదే. ఏమాత్రం పట్టింపులకు వెళ్లొద్దు. రాజకీయంగా ఎవరైనా ప్రోత్సహిస్తే, ఏదైనా తప్పుగా నిర్ణయం తీసుకుంటే మొత్తం వ్యవస్థ దెబ్బతినే పరిస్థితి ఉందన్న విషయాన్ని ఆలోచన చేయండి. మంత్రితో చర్చించండి. చేయగలిగిందేమున్నా చేస్తాం. ఇప్పుడిప్పుడే పట్టాలెక్కుతున్న ప్రభుత్వాన్ని మళ్లీ సమ్మెల పేరుతో ఏదైనా పొరపాటు జరిగితే, మళ్లీ పునరుద్ధరించడానికి అవకాశం కూడా లేని పరిస్థితులు తలెత్తుతాయి.

మీ అందరి సహకారంతో అన్నింటా తెలంగాణ నంబర్ వన్‌గా ఉంది. కార్మిక చట్టాలను సవరించి కార్మికులను ఆదుకునే విధానాన్ని తెచ్చి దేశానికి మార్గదర్శిగా తెలంగాణ నిలబెడుతాం. తెలంగాణ సాధనలో సింగరేణి కార్మికులు, ఆర్టీసీ కార్మికులు, విద్యుత్ శాఖ కార్మికులు, అసంఘటిత కార్మికుల పాత్ర మరువలేనిది. వారిని ఆదుకోవాలనే ఆలోచనతో సవరించుకుంటూ, సరిచేసుకుంటూ పాలన పరమైన ఎన్నో నిర్ణయాలు తీసుకుంటున్నాం. సింగరేణి సంస్థ లాభాల బాటలో నడవడమే కాకుండా గతంలో ఎప్పుడూ లేని స్థాయిలో కార్మికులకు, అవుట్ సోర్సింగ్ కార్మికులకు బోనస్ చెల్లించాం. బీమా సౌకర్యం అమలు చేస్తున్నాం. సింగరేణి సంస్థలను లాభాల బాటలో నడిపించడమే కాకుండా బొగ్గు ఉత్పత్తి పెంచి, కొత్త గనులను కేటాయించి నూతనంగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రయత్నిస్తున్నాం. సింగరేణిలో దాదాపు 400 పైచిలుకు కారుణ్య నియామకాలు చేపట్టాం. ఆర్టీసీలోనూ కారుణ్య నియామకాలు చేపట్టాం.రైతు భరోసా, రైతు రుణమాఫీ, షాదీ ముబారక్, కళ్యాణలక్ష్మి, ఆడబిడ్డలకు ఉచితంగా ఆర్టీసీ బస్సు ప్రయాణం, నిరుపేదలకు సన్నబియ్యం ఇలా రాష్ట్రంలో ఏ సంక్షేమ పథకం ఆగలేదు. అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే 60 వేల ప్రభుత్వ ఉద్యోగాలిచ్చాం. ఇన్ని చేసినా సరిపోతాయని భావించడం లేదు. ఇంకా సమస్యలున్నాయి. కార్మికులకు కష్టాలున్నాయి. వాటన్నింటినీ పరిష్కరించాలంటే కొంత సమయం కావాలి.

తెలంగాణలో పూర్తి చేసిన కులగణన ఈరోజు దేశానికి ఆదర్శవంతంగా నిలబడింది. తెలంగాణ మాడలే ఈరోజు కేంద్ర ప్రభుత్వం తీసుకోవలసి వచ్చింది. కులగణన చేస్తామన్నాం. చేశాం. ఎస్సీ వర్గీకరణ చేస్తామన్నాం. చేశాం. ఉద్యోగాలు ఇస్తామన్నాం. ఇచ్చాం. సన్న బియ్యం ఇచ్చాం. ఆడబిడ్డలకు ఉచిత బస్సు సౌకర్యం... ఇలా చేయగలిగింది ప్రతిదీ చేస్తున్నాం. ఏదైనా సమస్య ఉంటే మీకే చెప్పుకుంటాం. సహకరించండి" అని ముఖ్యమంత్రి గారు వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సలహాదారు హర్కర వేణుగోపాల్ రావు, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## విస్తృతంగా ప్రజల్లోకి భూభారతి

- నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు పూర్తి
- 555 మండలాల్లో అవగాహన సదస్సులు పూర్తి
- భూ సమస్యలపై 11, 630 దరఖాస్తుల స్వీకరణ
- ప్రాధాన్యతా క్రమంలో జూన్ 2లోగా పరిష్కారం
- ఫీడ్ బ్యాక్ ఆధారంగా మార్పులకు అవకాశం
- ఈ నెల 5వ నుంచి జిల్లాకు ఒక మండలం చొప్పున 28 మండలాలలో భూ భారతి
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

తెలంగాణ రాష్ట్రంలో భూ సమస్యలు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా గత నెల 14వ తేదీన అంబేద్కర్ జయంతి సందర్భంగా చారిత్రాత్మకమైన భూభారతి చట్టాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు రిజిస్ట్రేషన్ ప్రక్రియకు ఏమాత్రం ఆటంకం కలగకుండా ఉండేలా పైలట్‌గా ఖమ్మం జిల్లా నేలకొండపల్లి, కామారెడ్డి జిల్లా లింగంపేట, నారాయణ్‌పేట్ జిల్లా మద్దూర్, ములుగు జిల్లా వెంకటాపూర్ నాలుగు మండలాల్లో పూర్తి స్థాయిలో అమలు చేస్తున్నారు. ఇదే సమయంలో ఈ చట్టంపై ప్రజల్లో అవగాహన కల్పించడానికి ప్రతిరోజు ఒక మండలంలో రెండు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఈ రెండు సదస్సుల్లో కలెక్టర్లు స్వయంగా పాల్గొనాలని ఆదేశించింది. ఇందుకోసం మండల స్థాయిలో తహశీల్దార్ డిప్యూటీ తహశీల్దార్ ఆధ్వర్యంలో ఆరుగురు సభ్యులతో రెండు బృందాలను ఏర్పాటు చేసింది.

ఈ భూభారతి చట్టం రైతులకు అర్థమయ్యే విధంగా చట్టాన్ని అమలు చేసే అధికారులకు ప్రత్యేకంగా శిక్షణా తరగతులు నిర్వహించింది. భూభారతి చట్టంలో కీలక పాత్ర వహించిన రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఒక సవాల్‌గా తీసుకొని విస్తృత స్థాయిలో జిల్లాల్లో పర్యటించి రోజుకు రెండు, మూడు అవగాహనా సదస్సులలో స్వయంగా పాల్గొన్నారు. ఏప్రిల్ 17వ తేదీనుంచి 30వ తేదీవరకు దాదాపు 20 జిల్లాల్లో సుమారు 45 సదస్సులలో పాల్గొన్నారు.


నాలుగు పైలట్ మండలాల్లోని 72 రెవెన్యూ గ్రామాల్లో ఏప్రిల్ 17 వ తేదీ నుంచి 30వ తేదీవరకు రెవెన్యూ సదస్సులను పూర్తిచేశారు. ఈ సదస్సుల్లో చట్టంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూనే మరోవైపు ఆయా మండలాల్లో భూసమస్యలపై దరఖాస్తులను స్వీకరించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తుకు రశీదు అందజేశారు. ఒక ప్రత్యేక ఫార్మాట్ లో తయారు చేసిన దరఖాస్తులను రెవెన్యూ సదస్సుకు ముందు రోజే ప్రజలకు అందించారు.

లింగంపేటలో 3,702, వెంకటాపూర్‌లో 3,969, మద్దూర్‌లో 1,341, నేలకొండపల్లిలో 2,618 మొత్తం 11, 630 దరఖాస్తులను స్వీకరించారు. ఇందులో ప్రధానంగా పీపీబీకి సంబంధించి 3,446, సాదాబైనామాలపై 2,796 దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులన్నింటిని ఏరోజుకు ఆరోజు కంప్యూటర్ లో నమోదు చేసి సంబంధిత అధికారులకు పంపించారు. మండుటెండలను సైతం లెక్కచేయకుండా ప్రజలు స్వచ్ఛందంగా ఈ సదస్సుల్లో పాల్గొన్నారు. హైదరాబాద్ మినహా 605 మండలాలకు గాను 555 మండలాలలో బుధవారం నాటికి సదస్సులు పూర్తి అయ్యాయి. వచ్చిన దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి జూన్ 2వ తేదీ నాటికి ఆ నాలుగు మండలాల్లో భూ సమస్యలను పరిష్కరించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. మరోవైపు హైదరాబాద్ మినహా మిగిలిన 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలాన్నిపైలట్ గా తీసుకొని 28 మండలాల్లో పూర్తిస్థాయిలో భూభారతి చట్టాన్ని అమలు చేయాలని నిర్ణయించింది.

మిగితా 2వ పేజీలో

## ఎంటర్ టైన్ మెంట్ హబ్‌గా భారత్

- ప్రధాని మోడీ
- వేవ్స్ సదస్సును ప్రారంభించిన ప్రధాని




**బలగం టీవి, ముంబయి**

భారత్ ఎంటర్ టైన్ మెంట్ హబ్ గా మారుతుందని భారత్ ప్రధాని నరేంద్ర మోడీ తెలిపారు. ముంబయిలో జరుగుతున్న వేవ్స్ సమ్మిట్ ను మోడీ ప్రారంభించారు. వేవ్స్ సదస్సుకు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. సృజనాత్మక హబ్ గా తయారై కొత్త అవకాశాలు అందిపుచ్చుకోవాలన్నారు. సంప్రదాయ, నవతరాలను సమన్వయం చేయాలని సూచించారు. మనదేశంలో 1913 లో తొలి చిత్రం రాజా హరిశ్చంద్ర విడుదలైందన్నారు. గేమింగ్ రంగంలో యువతకు అనేక అవకాశాలు ఉన్నాయని చెప్పారు. 50 దేశాల గాయకులు కలిసి వైష్ణవ జనతో గీతం ఆలపించారని పేర్కొన్నారు. ప్రతిభ, సృజనాత్మకతల ఎకో సిస్టమ్ ను అభివృద్ధి చేయాలని నరేంద్ర మోడీ స్పష్టం చేశారు. అంతర్జాతీయ ప్రతిభ, సృజనాత్మకతల కోసం ప్రపంచ వేదిక నిర్మాణానికి వేవ్స్ పునాది వేస్తుందని ప్రధాని నరేంద్ర మోడీ అన్నారు. భారత్ ఎంటర్‌టైన్‌మెంట్ హబ్‌గా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. చిత్ర నిర్మాణం, డిజిటల్ కంటెంట్, గేమింగ్, ఫ్యాషన్, మ్యూజిక్, కాన్సర్ట్‌లకు భారతదేశం కేంద్రంగా అభివృద్ధి చెందుతున్న వేళ ప్రపంచ ప్రతిభకు ఒక వేదికను అందించే సామర్థ్యం వేవ్స్‌కు ఉంటుందని ప్రధాని తెలిపారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న క్రియేటర్లు, స్టార్టప్‌లు, ఇండస్ట్రీ లీడర్లు, పాలసీ మేకర్లను ఒకచోట చేర్చడం ద్వారా భారత్‌ను మీడియా, వినోదం డిజిటల్ ఆవిష్కరణలకు ప్రపంచ కేంద్రంగా ఉంచడం వేవ్స్ లక్ష్యమని మోదీ చెప్పారు. సామాజిక మాధ్యమాలు, ఓటీటీల్లో అసభ్య కంటెంట్‌ను ఉద్దేశించి మాట్లాడిన ప్రధాని, సమాజంలో సృజనాత్మకమైన బాధ్యతలు కలిగి ఉండటం ముఖ్యమన్నారు. మనుషులు రోబోల్లా మారకూడదని హితవుపలికిన ప్రధాని, మానవ సమాజ సున్నితత్వాన్ని కాపాడాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. మారుతున్న సాంకేతికతతో స్క్రీన్ పరిమాణం మినీగా మారుతున్నప్పటికీ భారతదేశం కథలు మెగాగా మారుతున్నాయని ఆయన అన్నారు.

## ఉగ్రవాదులెవరినీ విడిచిపెటం

- కేంద్ర హెూం మంత్రి అమిత్ షా
- ఢిల్లీలో బోడో సామాజికవేత్త ఉపేంద్రనాథ్ విగ్రహ ఆవిష్కరణ



**బలగం టీవి, న్యూఢిల్లీ బ్యూరో**

పహల్గాంలో దాడికి పాల్పడ్డ ఉగ్రవాదులకు కేంద్ర హెూం మంత్రి అమిత్ షా వార్నింగ్ ఇచ్చారు. దాడికి కారణమైన ఎవరినీ వదిలిపెట్టమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన పర్యాటకులకు కేంద్రమంత్రి నివాళులర్పించారు. దేశ రాజధాని ఢిల్లీలో బోడో సామాజికవేత్త ఉపేంద్రనాథ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమంలో షా పాల్గొన్నారు. ఉగ్రవాదం దేశ భద్రతకు తీవ్రంగా ప్రమాదంగా మారుతున్న నేపథ్యంలో కేంద్ర హెూంమంత్రి అమిత్ షా తీవ్ర స్థాయిలో స్పందించారు. దేశానికి భద్రత కల్పించడంలో ఒక్క అణువూ తగ్గని మోదీ ప్రభుత్వం ఎవరినీ విడిచిపెట్టదని ఆయన హెచ్చరించారు. "పిరికితనంతో దాడులు చేయడం వీరత్వం కాదు. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వం, ఇలాంటి దుశ్చర్యలపై అస్సలు రియాయితీ ఉండదు" అని ఆయన స్పష్టం చేశారు. దేశ భద్రతను ప్రమాదానికి గురిచేసే ఏ చర్యకైనా తగిన శిక్ష తప్పదని అన్నారు.

ఈ సందర్భంగా అమిత్ షా, ఉగ్రవాదంపై భారత్ చేస్తున్న పోరాటానికి ప్రపంచం మద్దతుగా నిలుస్తోందని తెలిపారు. భారత్‌తోపాటు ఇతర దేశాలు కూడా ఉగ్రవాదాన్ని మూలంతో నిర్మూలించాలనే లక్ష్యంతో ముందుకు వస్తున్నాయని పేర్కొన్నారు. "ఇది కేవలం 140 కోట్ల భారతీయుల పోరాటం మాత్రమే కాదు. యావత్ ప్రపంచం భారత ప్రజల వెంట నిలుస్తోంది" అని ఆయన అన్నారు. ఇది భారతదేశం ఒక అంతర్జాతీయ స్థాయిలో శాంతి, భద్రత కోసం ఎంత కీలక పాత్ర పోషిస్తోందనే దానికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని నాశనం చేసే వరకు కేంద్ర ప్రభుత్వం పోరాటం

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో అది ఈశాన్య ప్రాంతమైనా.. వామపక్ష తీవ్రవాదం ఉన్న ప్రాంతం అయినా, కశ్మీర్‌పై ఉగ్రవాద నీడ అయినా ప్రభుత్వం అందరికీ బలమైన సమాధానం ఇస్తుందన్నారు. ఎవరినీ వదిలిపెట్టబోమని.. దేశంలోని ప్రతి అంగుళం నుంచి ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని సంకల్పించినట్లు పేర్కొన్నారు. ఈ పోరాటంలో 140 మంది భారతీయులే కాకుండా ప్రపంచం మొత్తం భారత్‌లో నిలుస్తుందన్నారు. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా జరిగే పోరాటంలో ప్రపంచంలోని అన్ని దేశాలు ఐక్యంగా ఉన్నాయన్నారు. ఉపేంద్రనాథ్ విగ్రహం ఆవిష్కరించడం ఆనందంగా ఉందన్నారు. బోడో సామాజిక వర్గానికి మాత్రమే కాకుండా వారి భాష, సంస్కృతి, అభివృద్ధి కోసం పోరాడిన చిన్న తెగులకు ఈ విగ్రహం కీలకమైందన్నారు. బోడోఫా విగ్రహం బోడో సమాజంపై మాత్రమే కాకుండా అన్ని చిన్న తెగలపై కూడా గౌరవాన్ని పెంచుతుందన్నారు.

## నేడు ఢిల్లీకి సీఎం రేవంత్..

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు. నేడు సాయంత్రం ఢిల్లీలో జరగనున్న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశంలో పాల్గొనేందుకు ఆయన ఢిల్లీ వెళ్తున్నారు. ఈ సమావేశానికి కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే, ఏఐసీసీ ముఖ్య నాయకులతో పాటు అన్ని రాష్ట్రాల ముఖ్య కాంగ్రెస్ నేతలు హాజరుకానున్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన కుల గణన అంశంపై ఈ సమావేశంలో ప్రధాన చర్చ జరుగుతుందని సమాచారం. కుల గణనపై కాంగ్రెస్ పార్టీ భవిష్యత్తు వ్యూహాలు, విధానాలను ఈ సమావేశంలో చర్చించనున్నారు.

## బెట్టింగ్‌కు యువకుడి బలి


**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



అప్పులు చేసి ఆన్ లైన్ లో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడగా..ఆడబ్బులు పోవడంతో మనస్తాపం చెందిన ఓ యువకుడు ఆత్మహత్య పాల్పడ్డాడు.ఈ ఘటన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా మేడ్చల్ పోలీస్టేషన్ పరిధిలోని గౌడవెల్లి గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం గౌడవెల్లి గ్రామానికి చెందిన ఆటోడ్రైవర్ యాదగిరి రెండో కుమారుడు రాహుల్ (24) ఇంటర్ వరకు చదివి ఓ కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మద్యం తాగడం, ఆన్ లైన్ బెట్టింగ్‌కు అలవాటు పడిన అతను కొన్ని రోజులుగా అప్పులు చేసి ఐపీఎల్ బెట్టింగ్‌లో డబ్బులు పెట్టాడు. అందులో అతనికి నష్టం వచ్చింది. దాదాపు రూ.4 లక్షల వరకు అప్పులు కావడంతో తీవ్ర ఆందోళనకు గురైన అతను బుధవారం రాత్రి ఇంట్లోని పై గదిలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గురువారం ఉదయం కుటుంబీకులు గమనించి కన్నీరుమున్నీరవుతున్నారు.


## ఎయిర్ పోర్టులో రూ. 3.5 కోట్ల బంగారం సీజ్

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**



: అంతర్జాతీయ విమానాశ్రయంలో భారీగా బంగారం పట్టుబడింది. గురువారం దుబాయ్ నుంచి హైదరాబాద్ కు వచ్చిన ఓ ప్రయాణికుడిని తనిఖీ చేయగా.. అతని దగ్గర 3500 గ్రాముల బంగారాన్ని గుర్తించారు అధికారులు. బంగారాన్ని స్వాధీనం చేసుకున్న కస్టమ్స్ అధికారులు.. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పట్టుబడ్డ బంగారం విలువ బహిరంగ మార్కెట్లో దాదాపు రూ.3.45 కోట్ల వరకు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు అధికారులు.

## కులగణనలో అనుభవాలను కేంద్రానికి చెప్తాం



- రాహుల్‌గాంధీ ఆలోచనను కేంద్రం అమలు చేస్తుంది
- దాన్ని స్వాగతిస్తున్నాం
- తెలంగాణానే రోల్ మోడల్
- సీఎం రేవంత్‌రెడ్డి

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

దేశవ్యాప్తంగా జనాభా లెక్కల సందర్భంగా కుల గణనను కూడా చేర్చాలని నిర్ణయించిన నేపథ్యంలో తెలంగాణ అనుభవాలను కేంద్ర ప్రభుత్వానికి అందించడానికి తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చెప్పారు. జనాభా లెక్కల్లో కుల గణన అంశం చేర్చాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తూ, ఇందుకు ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ గారికి, కేంద్ర మంత్రివర్గానికి

మిగితా 2వ పేజీలో

## జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితా అనుసంధానం

- కేంద్ర ఎన్నికల సంఘం

**బలగం టీవి, హైదరాబాద్ బ్యూరో**

కేంద్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జనన, మరణ రికార్డులతో ఓటర్ల జాబితాను అనుసంధానం చేయనున్నట్టు తెలిపింది. ఇందుకోసం రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నుంచి మరణాల సమాచారాన్ని ఎలక్ట్రానిక్ రూపంలో ఎప్పటికప్పుడు తీసుకుంటామని వెల్లడించింది. తద్వారా అత్యంత కచ్చితత్వంతో ఓటరు జాబితాను నవీకరించే వీలుంటుందని పేర్కొంది. "నమోదిత మరణాలకు సంబంధించిన సమాచారాన్ని ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులు సకాలంలో పొందే వీలుంటుంది. చనిపోయిన వారి కుటుంబీకుల నుంచి విజ్ఞప్తి వచ్చేంతవరకు వేచి చూడకుండా.. ఆర్‌జీఐ నుంచి సమాచారం వచ్చిన వెంటనే బూత్ స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి సమాచారాన్ని ధ్రువీకరించుకుంటారు" అని ఎన్నికల సంఘం వెల్లడించింది. ఎన్నికల నిబంధనలు-1960, జనన, మరణాల నమోదు చట్టం-1969 ప్రకారం ఎన్నికల సంఘానికి ఈ సమాచారాన్ని తీసుకునే అధికారం ఉంది.

ఓటరు సమాచార చీటీ (వీఐఎస్) మరింత స్పష్టంగా కనిపించేందుకు వీలుగా దాని డిజైన్‌ను మార్చాలని ఎన్నికల సంఘం నిర్ణయించింది. సీరియల్ నంబర్, పార్టు నంబర్ల సైజును పెంచనున్నట్టు తెలిపింది. తద్వారా ఓటర్లు తమ పోలింగ్ స్టేషన్లను తేలికగా గుర్తించడంతోపాటు అటు పోలింగ్ అధికారులకు కూడా జాబితాలోని పేర్లను సులభంగా సరిచూసుకునే వీలుంటుంది. దీంతోపాటు బూత్ స్థాయి అధికారులకు కూడా ఫొటో ఐడీ కార్డులను జారీ చేయనున్నట్టు ఈసీ వెల్లడించింది.

# మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

● రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి



**బలగం టీవి, హైదరాబాద్**

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానానికి ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో ఈనెల7వ తేదీ నుంచి మరో 25 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ వాటిని అమలు చేయబోతున్నామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గత నెల పదో తేదీ నుంచి ప్రయోగాత్మకంగా 22 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేశామని ఏప్రిల్ 30వ తేదీ నాటికి 22 కార్యాలయాల్లో సగటున 866 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆయన వివరించారు. హైదరాబాద్‌లోని సచివాలయంలోని తన కార్యాలయంలో స్టాంప్స్ రిజిస్ట్రేషన్ విభాగంపై మంత్రి పొంగులేటి సుదీర్ఘంగా సమీక్షించారు. రెండోదశలో రంగారెడ్డి జిల్లాలోని ఫరూక్ నగర్, షాద్‌నగర్, మహేశ్వరం, వనస్థలిపురం, షేర్ లింగంపల్లి, మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని ఉప్పల్ , ఘట్‌కేసర్, నారపల్లి, మల్కాజ్‌గిరి, జనగాం, ఘన్‌పూర్, నర్సంపేట, బీబీనగర్, అదిలాబాద్ జిల్లాలోని మంచిర్యాల, పెద్దపల్లి , కల్వకుర్తి , వనపర్తి, గద్వాల్, గజ్వేల్ మెదక్ జిల్లాలో సిద్దిపేట పట్టణ గ్రామీణం, రంగారెడ్డి, వరంగల్, హైదరాబాద్, హైదరాబాద్ సౌత్ రిజిస్ట్రార్ ఆఫీస్‌లలో అమలు చేస్తామని మంత్రి తెలిపారు. 22 కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంలో వచ్చిన ఫీడ్‌బ్యాక్‌ను అధికారులను అడిగి ఆయన తెలుసుకున్నారు.

స్లాట్ బుకింగ్ విధానం అమలు అవుతున్న సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి పోస్ట్ కార్డుద్వారా అభిప్రాయాలను సేకరించగా 94 శాతం మంది సంతృప్తి వ్యక్తం చేసినట్లు అధికారులు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. స్లాట్‌బుకింగ్ విధానం విజయవంతం కావడంలో కృషి చేసిన అధికారులందరికీ ఆయన అభినందించారు. భవిష్యత్తులోనూ ఇదే విధంగా పనిచేసి స్టాంప్స్, రిజిస్ట్రేషన్ శాఖకు మంచిపేరు తీసుకురావాలని సూచించారు.

# అభివృద్ధికి అడ్డుపడుతున్న కేంద్ర మంత్రులు

● టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**బలగం టీవి, హైదరాబాద్**

తెలంగాణ అభివృద్ధికి కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి , బండి సంజయ్ అడ్డంకిగా మారారని టీపీసీసీ చీఫ్ మహేశ్ మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ కులగణన తప్పులు తడక అనడం కిషన్ రెడ్డి, బండి సంజయ్ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. బీఆర్‌ఎస్‌తో దోస్తీ కట్టి కాంగ్రెస్ ప్రభుత్వంపై నిత్యం విషం కక్కడం బీజేపీ నేతలకు అలవాటుగా మారిందన్నారు. కులగణన పై కేంద్రం నిర్ణయంతో రాహుల్ సంకల్పం సిద్ధించిందన్నారు. రాహుల్ గాంధీ ఆలోచన మేరకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల బృందం కుల గణనను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించిందని అన్నారు. శాసన సభలో 8 మంది బీజేపీ ఎమ్మెల్యేల సాక్షిగా ఏకగ్రీవ తీర్మానంతో బీసీ కుల గణనకు చట్ట బద్ధత కల్పించినట్లు తెలిపారు. బీసీల పట్ల బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే పార్లమెంట్ లో బీసీ 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని 50 శాతం రిజర్వేషన్ల పరిమితి ఎత్తివేసేలా పార్లమెంట్ లో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. బీసీ బిల్లు చట్ట బద్ధత కోసం ప్రధాని మోడీకి లేఖ రాసే దమ్ముందా అని కేంద్ర మంత్రులకు సవాల్ విసిరారు.

తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వ అభివృద్ధిని చూసి ఓర్వలేక కేంద్ర మంత్రులమని మరిచి మాట్లాడటం వారి అహంకారానికి పరాకాష్ట అని విమర్శించారు. పారదర్శక సర్వేపై తప్పుడు ఆరోపణలు చేయడానికి బీసీ బిడ్డగా బండి సంజయ్ ఆత్మ పరిశీలన చేసుకోవాలని సూచించారు. కేంద్రం జనగణన తో పాటు కులగణన నిర్ణయం కాంగ్రెస్ ప్రభుత్వ విజయమన్నారు. కేంద్రం దేశవ్యాప్తంగా కుల గణన ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటించాలని డిమాండ్ చేశారు. స్వతంత్ర భారతావనిలో కుల గణన నిర్వహించిన మొదటి రాష్ట్రం తెలంగాణ అని కొనియాడారు. చారిత్రాత్మక కుల గణన, ఎస్సీ వర్గీకరణ, బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిర్ణయాలతో దేశానికి ఆదర్శంగా తెలంగాణ నిలిచిందన్నారు.

# కులగణనలో అనుభవాలను కేంద్రానికి చెప్తాం

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు. జనాభా లెక్కల్లో కుల గణన చేర్చాలని కేంద్రం నిర్ణయించిన నేపథ్యంలో ముఖ్యమంత్రి మీడియా సమావేశంలో మాట్లాడారు. తెలంగాణలో నిర్వహించిన కుల గణన దేశానికి రోల్ మోడల్‌గా ఉందని, ఈ విషయంలో తమ అనుభవాలను పంచుకోవడానికి తెలంగాణ ప్రభుత్వానికి ఎలాంటి బేషజాలు లేవని స్పష్టం చేశారు. ఓబీసీల్లో రాష్ట్రాల వారిగా వేర్వేరు కేటగిరీలుగా ఉన్నందున, కుల గణన విషయంలో రాష్ట్రాల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు.

దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపట్టబోయే ముందు రాజకీయ పార్టీలతో చర్చించడానికి మంత్రులతో ఒక కమిటీని నియమించాలని, అలాగే ఉన్నతస్థాయిలో అధికారులతో కూడిన నిపుణుల కమిటీని ఏర్పాటు చేసి క్షుణ్ణంగా అధ్యయనం జరగాల్సి ఉంటుందని తెలిపారు. తమ అనుభవాలను పంచుకోవడానికి కేంద్రం మమ్మల్ని పిలిచినా, లేదా కేంద్ర ప్రతినిధులు వచ్చినా, తెలంగాణ నిర్వహించిన కుల గణనలో అనుసరించిన విధివిధానాలను వివరిస్తామని చెప్పారు. కన్యాకుమారి నుంచి కశ్మీర్ వరకు ప్రస్తుత లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు శ్రీ రాహుల్ గాంధీ గారు పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు, రాష్ట్రంలో అత్యంత పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో కుల గణన పూర్తి చేసి దేశంలోనే మొదటి రాష్ట్రంగా తెలంగాణ నిలిచిందని చెప్పారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ గారికి ప్రత్యేకంగా అభినందనలు తెలియజేశారు.

జనాభా లెక్కలు ఎప్పుడు ప్రారంభమై, ఎప్పటికి పూర్తవుతాయో కేంద్ర ప్రభుత్వం ప్రకటించాలని అన్నారు. కుల గణన చేపట్టడంలో ఎదురయ్యే సవాళ్లను ఏ విధంగా అధిగమిస్తారో అన్ని రాజకీయ పార్టీలను సమావేశ పరిచి వివరించి, వారి సలహాలను తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు సూచించారు. రాష్ట్రాలతో పాటు రాజకీయ పార్టీలు, సివిల్ సొసైటీలు, ప్రజల నుంచి అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలని చెప్పారు. ఈ ప్రక్రియలు పూర్తైన తర్వాత కుల గణనపై విధివిధానాలను ఖరారు చేయాలని సూచించారు. ఈ గణన పూర్తి చేయడానికి ఏడాది కాలం సరిపోతుందని తెలిపారు.

కుల గణన చేయడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత అని, అందుకే శాసనసభ ద్వారా ఒక తీర్మానం ఆమోదించి కేంద్రానికి నివేదించామని తెలిపారు. కుల గణన విషయంలో కేంద్ర ప్రభుత్వానికి సహకరించడానికి తమ ప్రభుత్వం ఒక బాధ్యతగానే చూస్తుందని చెప్పారు.ఇందులో ఎలాంటి రాజకీయాల జోలికి, పంతాలకు పట్టింపులకు వెళ్లదలచుకోలేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో పారదర్శకంగా, శాస్త్రీయ పద్ధతిలో కుల గణన ఏ విధంగా చేపట్టిందో ముఖ్యమంత్రి గారు వివరిస్తూ, దేశవ్యాప్తంగా చేపట్టాలనుకుంటున్న కుల గణనకు తెలంగాణలో చేపట్టిన గణన ఒక మార్గదర్శిగా నిలుస్తుందని, తమ అనుభవాలను పరిగణలోకి తీసుకోవాలని ముఖ్యమంత్రి గారు సూచించారు.

# విస్తృతంగా ప్రజల్లోకి భూభారతి

(మొదటి పేజీ తరువాయి)

**మార్పుకు నాంది : మంత్రి పొంగులేటి**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం దార్శనికతతో తీసుకువచ్చిన భూభారతి చట్టం విప్లవాత్మక మార్పుకు నాంది పలకబోతోంది. నూటికి నూరు శాతం ప్రజలే కేంద్ర బిందువుగా ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రైతు సంక్షేమమే లక్ష్యంగా ఈ చట్టం ఉంది. ఈచట్టానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన లభిస్తోంది. జిల్లాల్లో పర్యటించిన సందర్భంలో తమ భూ సమస్యలు ఈ భూభారతి చట్టంతో పరిష్కారమవుతాయనే నమ్మకం, విశ్వాసాన్ని రైతులు వ్యక్తం చేశారు. ధరణితో వారు అనుభవించిన కష్టాలను, బాధలను వ్యక్తం చేశారు. ధరణి తో వారు ఎదుర్కొన్న సమస్యలను చెప్తుంటే వారు పడ్డ కష్టం కళ్ళముందే కనిపించింది. రైతుల భూ సమస్యలను వీలైనంత త్వరితగతిన పరిష్కరించడానికి అధికార యంత్రాంగాన్ని సంసిద్ధం చేశాం. ఇకనుండి రైతులు ఏ కోర్టుల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా రెవెన్యూ కార్యాలయంలోనే వాళ్ళ సమస్యకు పరిష్కారం లభిస్తుంది. ప్రజల వద్దకే అధికారులు వచ్చి పైసా ఖర్చు పరిష్కరించే విధానం నిరంతరం కొనసాగుతుంది. ఈ పైలట్ నాలుగు మండలాలలో కోర్టు పరిధిలో ఉన్న భూ సమస్యలు మినహా అన్ని సమస్యలను జూన్ 2వ తేదీ నాటికి పరిష్కరిస్తాం. ఆ నాలుగు పైలట్ మండలాల మాదిరిగానే ఈ నెల 5వ తేది నుంచి రాష్ట్రంలోని 28 జిల్లాల్లో జిల్లాకు ఒక మండలంలో పూర్తి స్థాయిలో భూ భారతిని అమలు చేస్తున్నాం. చట్టం తీసుకువస్తే సరిపోదు, ఆ చట్టం పూర్తి స్దాయిలో అమలు జరిగినప్పుడే రైతులకు నిజమైన న్యాయం లభిస్తుంది. ఆ దిశగా మా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుంది" అని మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి అన్నారు.



## బీఆర్ఎస్ నేత కుమారుడి వివాహానికి హాజరైన కెసిఆర్ దంపతులు

**బలగం టీవి, హైదరాబాద్**

బీఆర్ఎస్ నేత కుమారుడి వివాహానికి పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దంపతులు హాజరయ్యారు. ఎర్రవెల్లి మాజీ ఎంపీటీసీ పెద్దోళ్ల భాగ్యమ్మ, వెంకటయ్య యాదవ్‌ల కుమారుడు విష్ణువర్ధన్ వివాహానికి కేసీఆర్, శోభమ్మ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన దంపతులను కేసీఆర్ దంపతులు ఆశీర్వదించారు. వివాహ వేడుకకు హాజరైన కేసీఆర్‌కు వెంకటయ్య యాదవ్ కుటుంబం ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కేసీఆర్ దంపతులు వచ్చి తమ కుమారుడిని, కోడలిని ఆశీర్వదించడం ఆనందంగా ఉందన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన చల్మెడ

**బలగం టివి, వేములవాడ**

కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన సీనియర్ కార్యకర్త నన్నసాయబు భార్య ఇటీవల క్యాన్సర్ తో మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను గురువారం బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు పరామర్శించి ప్రగాఢ సానుభూతి సంతాపాన్ని తెలియజేశారు. వారి వెంట సింగిల్ విండో ఛైర్మన్ బండ నర్సయ్య, రామ్మోహన్ రావు సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి, చంద్రయ్య గౌడ్, కదిరే శ్రీనివాస్, ప్రతాప రెడ్డి, దొంతరవేణి శ్రీనివాస్, తిరుపతి, ప్రవీణ్, రాములు నాయక్, శివతేజ తదితరులు ఉన్నారు.





## ప్రధాని మోడీ చిత్రపటానికి పాలాభిషేకం

**బలగం టివి, వేములవాడ**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ అర్బన్ భారతీయ జనతా పార్టీ మండల శాఖ అధ్యక్షులు బుర్ర శేఖర్ గౌడ్ ఆధ్వర్యంలో నంది కామన్ చౌరస్తా వద్ద కేంద్రప్రభుత్వం జనాభా లెక్కలతో పాటు కులగణన జరిపే విధంగా తీసుకున్న నిర్ణయానికి హర్షిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎర్రం మహేష్, ప్రధాన కార్యదర్శులు చంద్రగిరి ప్రశాంత్, నర్సింగోజు శంకర్, ఉపాధ్యక్షులు జింక శ్రీనివాస్, ఎరుగొక్కుల రమేష్, కార్యదర్శి కొలనూరి సంజీవ్ రెడ్డి, నాయకులు ముడికే రాములు,ముదం శ్రీనివాస్, పోచంపల్లి శ్రీకాంత్, బొల్లు తిరుపతి, గుగ్గిళ్ల చిన్న, రాగుల రామకృష్ణ, పేరంగిణి మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.



# పల్లె పల్లెన మే డే సంబరాలు

**రెపరెపలాడిన ఎర్ర జెండా**

**బలగం టీవీ, తంగళ్లపల్లి**

ప్రపంచ కార్మిక వర్గ పోరాట దినమైన మేడేను రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలం మండెపల్లి గ్రామంలో ఏఐటీయూసీ హమాలీ సంఘం కార్మికులు ఎర్ర జెండా ఎగరవేసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు పాతూరు సురేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినం కోసం ఎందరో పోరాడి అమరులయ్యారని వారి కృషి ఫలితంగానే ఈ139 వ మే డే దినోత్సవాన్ని జరుపుకుంటున్నామన్నారు.ఈ కార్యక్రమం లో అధ్యక్షులు పాతూరు సురేందర్ రెడ్డి, ఉప అధ్యక్షులు జగ్గాని రాములు, ప్రధాన కార్యదర్శి పన్యాల వెంకటరెడ్డి, కోశాధికారి జగ్గాని తిరుపతి, కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షులు ఆసాని భూపాల్ రెడ్డి, కిషన్, మల్లేశం, నాగరాజు, వెంకట్ రెడ్డి, జీవన్ రెడ్డి,బంద పెద్ద ఎల్లయ్య, బెస్త శివాజీ, దసరి రవి, ఒగ్గు చిన్న మల్లేశం, నక్క రాజయ్య,గుండారపు మల్లయ్య, పోతారాజు సుదర్శన్, ధనవేణి పెద్దయ్య, తదితరులు పాల్గొన్నారు.




# మండల్ ఫస్ట్ వచ్చిన విద్యార్థికి సన్మానం

**తల్లిదండ్రులతో పాటు విద్యార్థిని సన్మానించిన ఎంఈఓ**

**ప్రతి ఒక్క విద్యార్థి అర్పితను స్ఫూర్తిగా తీసుకోవాలి: ఎంఈఓ కృష్ణ హరి**

**బలగం టీవీ,ఎల్లారెడ్డిపేట**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన పదవ తరగతి పరీక్షలో అత్యున్నత మార్కులు సాధించి ఎల్లారెడ్డిపేట మండలంలోని ఫస్ట్ స్థాయిని సాధించుకుందని ఎంఈఓ కృష్ణ హరి అన్నారు. గ్రామానికి చెందిన రామిండ్ల అర్పిత 600/574 మార్కులు సాధించినందుకు ఎంఈఓ తన కార్యాలయంలో తల్లిదండ్రులతో విద్యార్థిని శాలువ కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రూపాయి ఖర్చు లేకుండా ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ లక్షల్లో ఖర్చు చేసే కార్పోరేట్ పాఠశాలల విద్యార్థులకు ఏ మాత్రం తీసిపోకుండా ఫలితాలు రావడం అభినందనీయం అని కొనియాడారు. ప్రాథమిక పాఠశాల నుండి ప్రభుత్వ బడుల్లో చదువుతూ ఈ విధంగా 500 పైబడి మార్కులు సాధించి, ప్రభుత్వ బడి జెండా రెపరెపలాడించిన విద్యార్థులను త్వరలోనే సన్మానించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు గంగయ్య , ఉపాధ్యాయులు గోల్కొండ శ్రీధర్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

# సహాయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మానం

**బలగం టీవీ, ఎల్లారెడ్డిపేట**



రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామానికి చెందిన విద్యార్థినీని సహాయ ఫౌండేషన్ వారు ఘనంగా సన్మానిం చారు.దుమాల గ్రామానికి చెందిన అర్పిత ప్రభుత్వ పాఠశాలలో పదవ తరగతి చదివి నిన్నటి రోజు వెలువడిన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి 600 /574 మార్కులు సాధించినందుకు సంతోషం వ్యక్తం చేస్తూ సహాయ ఫౌండేషన్ వ్యవస్థాపకులు ఎండి షాదుల్, సహా ఫౌండేషన్ అధ్యక్షులు లద్దునూరి వెంకటరమణ, ఉపాధ్యక్షులు ఘనగోని సంతోష్, దుబ్బాక సతీష్, టిఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు ఎడ్ల సందీప్, టిఆర్ఎస్ మాజీ జడ్పీ జిల్లా కోఆప్షన్ ఎండి చాంద్ పాషా, కోలా బాబు రెడ్డి అజీజ్ శరవీంద్ చెట్యార్కి రాజు భాస్కర్ లు శాలువా కప్పి ఘనంగా సన్మానించి ఆమెను అభినందించారు. పేదింటి విద్యార్థి చిన్న గ్రామంలో అత్యధిక మార్పులు సాధించి తల్లిదండ్రుల కల నెరవేర్చినందుకు ఎంతో గర్వకారమన్నారు. అలాగే భవిష్యత్తులో ఉన్నత చదువులు చదివి ఉద్యోగం సాధించాలని వారు ఆశీర్వదించారు.

# దేశానికే తెలంగాణ ఒక రోల్ మోడల్

**● ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**

**బలగం టివి, వేములవాడ**



తెలంగాణ ప్రభుత్వం రాష్టంలో కుల గణన చేయడం ద్వార తెలంగాణ రాష్ట్రం దేశానికి ఒక రోల్ మోడల్ గా నిలుస్తుందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పాదయాత్ర చేస్తున్న సందర్భంగా దేశంలో ఉన్న అసమానతలు తొలగించి కుల గణన చేయాలని సంకల్పించారని,దానికి అనుగుణంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని తెలంగాణ ప్రభుత్వం కుల గణన చేయడం జరపడం జరిగిందని అన్నారు.కుల గణన ను అసెంబ్లీలో ఆమోదం తెలిపి కేంద్ర ప్రభుత్వానికి పంపించామని,దానిని చట్టంగా మార్చి షెడ్యూల్ నైన్ లో చేర్చాలని అన్నారు.రాహులు గాంధీ పోరాటం రేవంత్ రెడ్డి ఆలోచన దేశా వ్యాప్తంగా కుల గణన చేయాలని కేంద్ర ప్రభుత్వం సంకల్పించదని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం నిర్ణయాన్ని కాంగ్రెస్ పార్టీ విజయంగా భావిస్తున్నామని అన్నారు. వెనుకబడిన వర్గాల లెక్క తేల్చి వారికి ఉద్యోగ, విద్య రాజకీయంగా రిజర్వేషన్లు కల్పించాలని భారత్ జూడో యాత్ర సందర్భంగారాహుల్ గాంధీ సంకల్పించారని అన్నారు.బిసి బిడ్డగా తెలంగాణ అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పొన్నం ప్రభాకర్ ప్రవేశా పెడితే బలపరిచే అవకాశం నాకు లభించిందని అన్నారు.

ఎన్ని అడ్డంకులు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలంగాణ రాష్ట్రంలో కూల గణన నిర్వహించి, బీసీ ల సంఖ్య 56.36 శాతంగా లెక్క తేల్చారని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం బీసీ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి షెడ్యూల్ నైన్ లో చేర్చాలని ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద ధర్నా నిర్వహించడం జరిగిందని,జంతర్ మంతర్ వద్ద ధర్నా లో వివిధ పార్టీల ఎంపీలు వచ్చి మద్దతు తెలిపారని అన్నారు.

దేశంలో కూల గణనపై జరుగుతున్న ఒత్తిడి తట్టుకోలేక బిజెపి ప్రభుత్వం దానికి అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు.

బిఆర్ఎస్ అనాడు కుల గణన చెసి వారి రాజకీయ అవసరాల కోసం వాడుకున్నారని అన్నారు.బీజేపీ బిఆర్ఎస్ పార్టీలు తెలంగాణ ప్రభుత్వం చేసిన కుల గణన పై తపుడు ఆరోపణలు చేశారని అన్నారు.ప్రతి దాన్ని రాజకీయ కోణంలో చూడటం మానుకోవాలని,

రానున్న రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తూ ముందుకు పోతామని అన్నారు.

# కులగణనపై కేంద్ర క్యాబినెట్ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

**-బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు**

**బలగం టీవీ, సిరిసిల్ల**




దేశ వ్యాప్తంగా కులగణన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నట్లు బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు అన్నారు.గురువారం సిరిసిల్ల ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీసీ సంక్షేమసంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మాండ్లు మాట్లాడుతూ చట్టసభలలో బీసీలకు రిజర్వేషన్ కల్పించాలని ,దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేపట్టాలని ,బీసీ ఉద్యోగులకు పదోన్నతులలో రిజర్వేషన్లు కల్పించాలని ,కేంద్రంలో బీసీలకు ఓబీసీ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని అనేక దశాబ్దాలుగా బీసీలుగా ఉద్యమిస్తున్నామని అన్నారు. దేశంలోని అనేకమైన ఓ బి సి సంఘాలు, ప్రజాసంఘాల పోరాట%శీ%, ఉద్యమాల వల్ల కేంద్ర ప్రభుత్వం తలొగ్గి బీసీ కులగనన నెరవేరుస్తున్నారని అన్నారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా కులగనన డిమాండ్ ను జాతీయస్థాయిలో ఒక ఎజెండా అంశంగా తీసుకొచ్చారని అందుకు రాహుల్ గాంధీ కి ప్రత్యేకమైన ధన్యవాదాలు తెలిపారు.

11 సంవత్సరాల నుండి బీసీల కొరకు ఒక్క మంచి పని కూడా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం చేయలేదని, ఏ గణనా బీజేపీ చరిత్రలో ఒక చారిత్రాత్మక నిర్ణయమని,కేంద్ర ప్రభుత్వానికి, పి ఎం నరేంద్ర మోడీకి ధన్యవాదాలు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం సామాజిక రిజర్వేషన్లపై 50% రిజర్వేషన్ ఎత్తివేయాలని, తెలంగాణలో 42 శాతం, బీహార్లో 65 రిజర్వేషన్ కేంద్రం వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు వీరవేని మల్లేష్ యాదవ్,పట్టణ అధ్యక్షుడు కమలాకర్, మున్నూరు కాపు సంఘం జిల్లా అధ్యక్షుడు బోప్పదేవయ్య ,సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు తడ్క కమలాకర్,ఇల్లంత కుంట తిరుపతి , బచ్చు ప్రసాద్ ,సామల తిరుపతి,కొండ విజయ్,తొట్ల మల్లేశం,తొట్ల మల్లేశం,రోహిత్ యాదవ్ ,కొండయ్య,దామోదర్ ,శ్రీనివాస్ ,నరేందర్,శ్రీధర్ తదితరు పాల్గొన్నారు.

# పీఎం మోడీ చిత్రపటానికి పాలాభిషేకం..



**బలగం టీవీ, సిరిసిల్ల**

భారత దేశవ్యాప్తంగా కులగణనకు మోదీ సర్కారు కీలక నిర్ణయం తీసుకోవడం పట్ల సిరిసిల్ల పట్టణంలో ప్రధానమంత్రి మోడీ చిత్రపటానికి బిజెపి నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి సిరిసిల్ల పట్టణ అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ మాట్లాడుతూ బుధవారం జరిగిన రాజకీయ వ్యవహారాల క్యాబినెట్ కమిటీ సమావేశంలో, జనాభా లెక్కలతోపాటే కులగణనను నిర్వహించాలని తీర్మానించారని అన్నారు.కాంగ్రెస్ పార్టీ తెలంగాణ, కర్ణాటకల్లో కులగణన తప్పుల తడకగా లెక్కలు చేసి, మళ్లీ లెక్కిస్తామని ప్రకటన చేశారని అన్నారు. కాంగ్రెస్ పార్టీ కేంద్రంలో దశాబ్దాలుగా అధికారంలో ఉన్నప్పుడు ఈ అంశాన్ని విస్మరించిందని, అధికారం పోయాక విమర్శలు తప్ప చేసేది ఏం లేదు అని అన్నారు. మోదీ సర్కారు తీసుకున్న ఈ నిర్ణయాన్ని దేశవ్యాప్తంగా బీసీ, ఎస్సీ ఎస్టీ లు మరియుప్రతి కులస్తులు అందరూ స్వాగతిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ మ్యాన రాంప్రసాద్,జిల్లా కార్యదర్శి గజ బింకర్ చందు, పట్టణ ప్రధాన కార్యదర్శి ఎనగంటి నరేష్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు పండగ మాధవి, బీజేవైఎం ఉపాధ్యక్షుడు దూడం శివప్రసాద్, పట్టణ ఉపాధ్యక్షులు చొప్పదండి అంజన్న, ఊరగొండ రాజు, మోర శ్రీహరి, పంపరి అర్జున్, చొప్పదండి శ్రీనివాస్, కోడం శ్రీనివాస్, ఇంజాపూరి మురళి, దుమాల శ్రీకాంత్, మహేశుని అనిల్, దూడం సురేష్, టవటం రాజలింగం, నాగుల శ్రీనివాస్, చొక్కి శీను, పచ్చునూరి సురేష్, వేముల సురేష్, గాలి శీను, కర్నే రేవంత్, కోడం రవి, తాటిపాముల విష్ణు, జింగం శ్రీనివాస్, వేముల పోశెట్టి, నల్లగొండ సాయిచంద్, భాగయ్య, ఆడెపు వేణుమాధవ్, చిలుక శ్రీకాంత్ కర్నె గణేష్, బీజేపీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు

# రాజస్థాన్‌పై ముంబై భారీ విజయం



- 100 పరుగుల భారీ తేడాతో గెలుపు
- వరుసగా ఆరో విక్టరీ
- ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించిన రాజస్థాన్ రాయల్స్

**బలగం టీవీ, హైదరాబాద్**

ఐపీఎల్ 2025 సీజన్‌లో ముంబై ఇండియన్స్ వరుసగా ఆరో విజయాన్ని నమోదు చేసింది. రాజస్థాన్ రాయల్స్‌తో జైపూర్ వేదికగా గురువారం ఏకపక్షంగా సాగిన మ్యాచ్‌లో ముంబై ఇండియన్స్ 100 పరుగుల భారీ తేడాతో విజయం సాధించింది.

ముందుగా బ్యాటింగ్ చేసిన ముంబై ఇండియన్స్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్లకు 217 పరుగులు చేసింది. ర్యాన్ రికెల్టన్(38 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్స్‌లతో 61), రోహిత్ శర్మ(36 బంతుల్లో 9 ఫోర్లతో 53) హాఫ్ సెంచరీలతో రాణించారు. సూర్యకుమార్ యాదవ్(23 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 48 నాటౌట్), హార్దిక్ పాండ్యా(23 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 48 నాటౌట్) మెరుపులు మెరిపించారు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లలో మహీష్ తీక్షణ, రియాన్ పరాగ్ చెరో వికెట్ తీసారు.

అనంతరం రాజస్థాన్ రాయల్స్ 16.1 ఓవర్లలో 117 పరుగులకు ఆలౌటై ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. జోఫ్రా ఆర్చర్(27 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 30) టాప్ స్కోరర్‌గా నిలవగా.. మిగతా బ్యాటర్లు దారుణంగా విఫలమయ్యారు. ఓపెనర్లు వైభవ్ సూర్యవంశీ(0), యశస్వి జైస్వాల్(13) తీవ్రంగా నిరాపరిచారు. ముంబై బౌలర్లలో కర్ణ్ శర్మ(3/19), ట్రెంట్ బౌల్ట్(3/28) మూడేసి వికెట్లు తీయగా.. జస్‌ప్రీత్ బుమ్రా (2/15) రెండు వికెట్లు పడగొట్టాడు. దీపక్ చాహర్, హార్దిక్ పాండ్యా తలో వికెట్ తీసారు. 12 ఏళ్ల సుదర్ఘ నిరీక్షణ తర్వాత జైపూర్ గడ్డపై ముంబై ఇండియన్స్ విజయం సాధించింది. ఈ ఓటమితో రాజస్థాన్ రాయల్స్ అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది.



## లార్డ్స్‌లో టీ20 ప్రపంచకప్ ఫైనల్

**బలగం టీవీ, హైదరాబాద్**

వచ్చే ఏడాది ఇంగ్లాండ్ వేదికగా జరగనున్న మహిళల టీ20 ప్రపంచకప్ కు సంబంధించిన షెడ్యూల్‌ను ఐసీసీ విడుదల చేసింది. షెడ్యూల్ ప్రకారం ఈ మెగాటోర్నీ 2026 జూన్ 12 నుంచి ప్రారంభం కానుంది. జూలై 5న లండన్‌లోని ప్రఖ్యాత స్టేడియం లార్డ్స్‌లో ఫైనల్ మ్యాచ్ జరగనుంది. మొత్తం 24 రోజుల పాటు కొనసాగనున్న ఈ టోర్నీలో 33 మ్యాచ్‌లు జరగనున్నాయి. 12 జట్లు కప్పు కోసం పోటీపడనున్నాయి.

టీ20 ప్రపంచకప్ మ్యాచులు ఓల్డ్ ట్రాఫోర్డ్, హెడింగ్లీ, ఎడ్జ్‌బాస్టన్, ఓవల్, హాంప్‌షైర్ బౌల్, బ్రిస్టల్ కౌంటీ గ్రౌండ్‌లలో జరుగనున్నాయి. టోర్నమెంట్‌లోని జట్లను రెండు గ్రూపులుగా విభజించారు. గ్రూప్ రౌండ్ మ్యాచ్‌ల తర్వాత నాకౌట్ మ్యాచులు జరుగుతాయి. ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, న్యూజిలాండ్, దక్షిణాఫ్రికా, వెస్టిండీస్‌తో సహా ఎనిమిది జట్లు అర్హత టీ20 ప్రపంచకప్‌కి అర్హత సాధించాయి. మిగతా నాలుగు జట్లకు క్వాలిఫైయర్ పోటీలు నిర్వహించనున్నారు.

ఐసీసీ అధ్యక్షుడు జై షా మాట్లాడుతూ అన్ని జట్లకు బ్రిటన్‌లో అభిమానుల నుంచి మద్దతు లభిస్తుందన్నారు. 2017లో లార్డ్స్‌లో జరిగిన మహిళల ప్రపంచ కప్ ఫైనల్‌లో స్టేడియం కిక్కిరిసిపోయిందని.. ఫైనల్‌కు ఇంతకంటే మంచి వేదిక లేదన్నారు. టోర్నమెంట్‌కు సిద్ధమవడంపైనే దృష్టిని కేంద్రీకరించినట్లు తెలిపారు. ఆస్ట్రేలియా–ఇంగ్లాండ్ మధ్య జరిగిన 2020 టీ20 ప్రపంచ కప్ ఫైనల్‌ను చూసేందుకు మెల్‌బోర్న్‌లో రికార్డు స్థాయిలో 86,174 మంది ప్రేక్షకులు వచ్చారు. ఆ తర్వాత కేప్ టౌన్ (2023), దుబాయి (2024) టీ20 ప్రపంచ కప్ ఫైనల్ మ్యాచుల సమయంలోనూ స్టేడియాలు ప్రేక్షకులతో నిండిపోయాయి.




## హిట్ 3 సక్సెస్ సెలబ్రేషన్స్..

**బలగం టీవీ, హైదరాబాద్**

నటుడు నాని హీరోగా శైలేష్ కొలను తెరకెక్కించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ హిట్ 3 చిత్రం కాగా, ఈ సినిమా గురువారం ప్రేక్షకుల ముందుకు వచ్చి మంచి విజయం సాధించింది. దాంతో మూవీ యూనిట్ సక్సెస్ సెలబ్రేషన్స్ చేసుకుంది. ఈ సంతోషంతో నాని డైరెక్టర్ శైలేష్ కొలనుకు రంగులు పూశాడు. అనంతరం వారు మీడియాతో మాట్లాడుతూ ఆనందం వ్యక్తం చేశారు.

## భారతదేశంలో లక్షలాది కథలు ఉన్నాయి

**బలగం టీవీ, హైదరాబాద్**



ముంబయిలో జరిగిన వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్‌కి స్టార్ హీరోలు, డైరెక్టర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాజమౌళి కథ చెప్పడంలో భారతదేశానికి ఉన్న డీప్ కనెక్షన్ గురించి ఎమోషనల్‌గా మాట్లాడారు. ‘భారతదేశం గడ్డపై వేల సంవత్సరాలుగా కథలు, కథకులు ఉన్నారు. మన పురాణాలు, ఇతిహాసాల నుంచి లక్షలాది కథలు మన దగ్గర ఉన్నాయి. వందల భాషలు, కోట్ల కథలు, మన కథలు అనంతం’ అని చెప్పారు. శతాబ్దాల చరిత్ర కలిగిన వైవిధ్యమైన భాషలు, లెక్కలేనన్ని కళారూపాలు భారతదేశ కథా సంస్కృతిని ప్రపంచంలోనే సాటి లేనివిగా చేస్తాయని పేర్కొన్నారు. అంతర్జాతీయ వేదికపై భారతదేశం యూఎస్ఏ, దక్షిణ కొరియా, చైనా వంటి దేశాల కంటే వెనుకబడి ఉందని రాజమౌళి అంగీకరించారు. అయినప్పటికీ అతడు ఆశావాదంతో ఉన్నారు. ‘మనకు ఉన్న శక్తిపై నాకు ఎటువంటి సందేహం లేదు. మనకు సరైన లాంచ్‌ప్యాడ్ మాత్రమే అవసరం. WAVES ఆ లాంచ్‌ప్యాడ్‌ను సులభతరం చేస్తుందని నేను ఆశిస్తున్నాను’ అని అన్నారు.

## శ్రేయాస్ అయ్యర్‌కు జరిమానా..

**బలగం టీవీ, హైదరాబాద్**



ఐపీఎల్‌లో పంజాబ్ కింగ్స్ జట్టు కెప్టెన్ శ్రేయాస్ అయ్యర్‌కు 12 లక్షల జరిమానా పడింది. చెన్నైతో జరిగిన మ్యాచ్‌లో స్లో ఓవర్ రేటు కారణంగా అతనికి ఫైన్ వేశారు. చెన్నైతో మ్యాచ్‌లో పంజాబ్ జట్టు 4 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. నిర్దేశిత సమయంలో పంజాబ్ జట్టు తమ ఓవర్ల కోటాను పూర్తి చేయలేకపోయింది. ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.22 ప్రకారం అయ్యర్‌కు జరిమానా వేశారు.

## విజయ్ దేవరకొండపై కేసు

**బలగం టీవీ, హైదరాబాద్**




నటుడు విజయ్ దేవరకొండ పై హైదరాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. న్యాయవాది కిషన్ చౌహాన్ ఫిర్యాదు మేరకు కేసు ఎస్సార్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. రెట్రో ఈవెంట్లో ఆదివాసులను అవమానించారని కిషన్ చౌహాన్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేరస్తున్నట్లు సమాచారం. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## క్షమాపణలు చెప్పిన శ్రీవిష్ణు

**బలగం టీవీ, హైదరాబాద్**



తాజాగా శ్రీ విష్ణు నటించిన చిత్రం ‘సింగిల్’. కేతికా శర్మ, ఇవానా ఈ సినిమాలో హీరోయిన్లు. కొద్దిరోజుల క్రితమే ఈ సినిమా ట్రైలర్‌ను చిత్రం బృందం విడుదల చేసింది. అయితే ట్రైలర్‌లో కన్నప్ప సినిమాలోని ఓ డైలాగ్‌ని కామెడీగా చూపిస్తూ.. వాడారు. ఈ క్రమంలో చిత్ర యూనిట్.. సింగిల్ సినిమాపై ఫైర్ అయింది. దీంతో కన్నప్ప మూవీకి శ్రీవిష్ణు క్షమాపణలు చెబుతూ.. ఓ వీడియోని విడుదల చేశారు. సింగిల్ సినిమాకు ప్రేక్షకులు నుంచి మంచి స్పందన వచ్చిందని.. కానీ, కన్ని సంభాషణ ‘కన్నప్ప’ మూవీ టీంని హర్ట్ చేశాయని తెలిసింది. అది ఉద్దేశపూర్వకంగా చేసింది కాదు. అయినప్పటికీ తప్పు కాబట్టి.. ఆ సీన్స్‌ని మేం వెంటనే తొలగించాము. సినిమాలో కూడా ఉండవని స్పష్టం చేశారు. సోషల్‌మీడియాలో ట్రెండింగ్‌లో ఉన్న టాపిక్స్, వేర్వేరు హీరోల నుంచి రిఫరెన్స్‌ని తీసుకుంటా మని అయినప్పటికీ ఎవరినైనా బాధపెట్టి ఉండే క్షమించండి అని వివరించారు. ఇండస్ట్రీలో అందరూ ఓ కుటుంబంలా ఉండాలని ఆయన కోరారు.




## ‘కింగ్డమ్’ ఫస్ట్ సాంగ్ ప్రోమో విడుదల

**బలగం టీవీ, హైదరాబాద్**

గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో విజయ్ దేవరకొండ తాజా చిత్రం ‘కింగ్‌డమ్. సితార ఎంటర్‌టైన్‌మెంట్ బ్యానర్‌పై నాగ వంశీ నిర్మిస్తున్న ఈ మూవీలోకి విజయ్ జంగటా.. భాగ్యశ్రీ భోర్సే కనిపించనుంది. కాగా, ఎన్టీఆర్ వాయిస్ తో ఈ చిత్రం నుండి ఇప్పటికే గ్లింప్స్ విడుదల చేయగా.. మంచి హైప్ క్రియేట్ అయ్యింది. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్ ప్రోమోని రిలీజ్ చేసారు మేకర్స్. హృదయం లోపల.. అంటూ ఈ పాట ఫుల్ సాంగ్ మే 2న రిలీజ్ చేయనున్నట్టు ప్రకటించారు. ఇక కింగ్డమ్ సినిమా వచ్చే మే 30న థియేటర్లలో రిలీజ్ కానుంది.



నటి పూజాహెగ్డే సూర్య సరసన నటించిన రెట్రో సినిమా గురువారం విడుదలైంది. కాగా ఈ సినిమా నుంచి ఆమె పాత్రకు సంబంధించిన పలు ఫోటోలు సోషల్ మీడియాలో వైరలవుతున్నాయి.